విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఐఎన్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య జయభేరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశవ్యాప్తంగా ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపి యాడ్ సంస్థ నిర్వహిం చిన 2వ లెవల్ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా లెవెల్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలను బుర్రి పాలెంలోని శ్రీచైతన్య స్కూల్ కైవసం చేసుకుంది. 8మందికి ప్రత్యేక బహుమతులు, 19 మందికి గోల్డ్‌మెడల్స్, 35 మందికి కన్సోలేషన్ బహుమతులు, 158 మంది మెరిట్ సర్టిఫికెట్స్ అందుకున్నారు. స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీపతి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆర్ఐ అప్పాజీ మాట్లాడుతూ పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవెల్ టీచింగ్ సిస్టమ్ అంకితభావంతో పని చేసే అధ్యాపకులే కారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ జి.గోపీచంద్, డీన్.ప్రవీణ్, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ సమాజం నిర్మించుకున్న కళాత్మక ప్రదర్శన నాటకం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మానవ సమాజం నిర్మించుకున్న కళాత్మక ప్రదర్శన నాటకమని రంగస్థల నటులు, దర్శకులు, నాటక రచయిత కావూరి సత్యన్నారాయణ అన్నారు. మానవులు ఉన్నంత వరకూ నాటకం సజీవంగా ఉంటుందన్నారు. సోమవారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ప్రపంచ రంగస్థల దినోత్సవం' గాయకులు పి.మొగిలి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కావూరి సత్యన్నారాయణ మాట్లాడుతూ సంస్కృతులను ఏకం చేయటం నాటకంతోనే సాధ్యమన్నారు. నాటకం సార్వజనీనమని, ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కల ఒకటని చెప్పారు. కాలాన్ని బట్టి.. ప్రదేశాన్ని బట్టి...సంస్కృతిని బట్టి నాటక రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూలసూత్రం మాత్రం అందరికొక్కటే ఉంటుందన్నారు. విశ్రాంత వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ బి.వేదయ్య మాట్లాడుతూ ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటూ విశ్వజనీనమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, జయకుమార్, సాంబయ్య, భాగ్యలక్ష్మి, పీఎస్ మూర్తి తదితరులు కూడా ప్రసంగించారు.

అరసం యువ వచన కవితా పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం), విశాలాంధ్ర దినపత్రిక సంయుక్తంగా యువ కవులకు 'వచన కవితా పోటీలు' నిర్వహిస్తున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్తమాన రాజకీయ సామజిక అంశాలపై 30 పంక్తులకు మించని కవితలు, ఒకరు ఒకటి మాత్రమే ఏప్రిల్ 27వ తేదీలోగా పంపాలని, కవుల వయసు 30 సంవత్సరాలు మించరాదని, దళితులను, మైనార్టీలను, స్త్రీలను కించపరిచే కవితలు పంపరాదని ఆయన తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1500, రూ.1000, రూ.750లతో పాటు ఎంపికైన కవితలను విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురిస్తారని శివప్రసాద్ తెలిపారు. కవితలను ఎక్కడా ప్రచురితం కాని స్వీయ రచన అనే హామీ పత్రంతో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, 401, శ్రావణి రెసిడెన్సీ, 6/3, ఎస్‌వీఎన్ కాలనీ, గుంటూరు. చరవాణి: 9291530714కు పంపాలని సూచించారు.

రామ్ చరణ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని షిర్డి సాయి దీన జన సేవా సమితి వసతి గృహంలో మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర నాయకులు మేకల రవీంద్రబాబు, డాక్టర్స్ బృందం, అతిథుల సమక్షంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేశారు. డాక్టర్ గాదె వేణుగోపాల రావు, డాక్టర్ ఎన్‌పీ చిట్టిబాబు, డాక్టర్ వై.వీరయ్య తదితరులు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. వారు మాట్లాడుతూ రామ్‌చరణ్ మెగా పవార్ స్టార్ నుంచి గ్లోబల్ స్టార్‌గా ఎదిగారని కొనియాడారు. రానున్న రోజుల్లో సినీపరిశ్రమకు మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రవీంద్రబాబు చేతులు మీదగా పౌష్టికాహారం అందజేశారు. పండ్లు, స్వీట్, కేక్ పంచారు. ఈ కార్యక్రమంలో మొఖమాటం రమేష్, సాంబశివరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య యాత్ర జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సైకో పాలన పోవాలి - సైకిల్ పాలన రావాలని తాడికొండ నియోజకవర్గంలో ఏప్రిల్ 2వ తేదీ నుండి సామజిక న్యాయ చైతన్య పాదయాత్ర నిర్వహించచున్నామని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా నియోజకవర్గ యువత, టి.ఎన్.ఎస్.ఎఫ్, ఐటిడిపి కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సామ జిక న్యాయం కోసం పోరాడిన బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలె, జగజ్జీవన్ రామ్ జయంతిల కార్యక్రమాలను నిర్వహించుకుంటూ పాద యాత్ర కొనసాగుతుందన్నారు. వీరి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే సామజిక న్యాయ చైతన్య పాదయాత్ర ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, తలతోటి సురేంద్ర, పుట్టి రామచంద్రరావు, ధనేకుల నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సలాం సెంటర్‌లో ఆర్కే పర్యటన

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధి తాడేపల్లి పట్టణ పరిధిలోని సలాం సెంటర్, వడ్డెర కాలనీ ప్రాంతాల్లో సోమవారం మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు సమస్యలపై స్థానిక మహిళలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సలాం సెంటర్ ప్రాంతంలో మహిళలు మంచినీటి కుళాయిలు, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే ఆ ప్రాంతంలో మున్సిపల్ అధికారులతో కొలతలు తీసుకొని వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే వడ్డెర కాలనీ, సలాం సెంటర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకొని త్రాగునీరు సకాలంలో అందుతుందా లేదా అధికారులు తెలుసుకొని పరిష్కార్ మార్గాలను చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శ్రీదేవి దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: వైసీపీకి వెన్నుపోటు పొడిచిన ఉండవల్లి శ్రీదేవిని క్షమించేది లేదని మండల వైకాపా నాయకులు శ్రీదేవిపై పలు ఆరోపణలు చేస్తూ శ్రీదేవి దిష్టిబొమ్మను స్థానిక సొలస్స బస్టాండ్ సెంటర్‌లో సోమవారం దగ్ధం చేశారు. గౌరవ ముఖ్యమంత్రిపై శ్రీదేవి అపుచిత వ్యాఖ్యలను సహించబోమని తాడికొండ నియోజ వర్గం నాలుగు మండలాల్లో ఎమ్మెల్యే స్థానంలో ఉండి పలు దోపిడీలకు పాల్పడిన ఘనత శ్రీదేవిదేనని జడ్పీటీసి ఆగ్రహించారు. కాళ్ళు అరిగేలా తిరిగి ఓట్లు వేయించి గెలిపిస్తే ముఖ్యమంత్రికే టోకరా వేసిన నిన్ను నియోజక వర్గ ప్రజలు వదిలిపెట్టరని వైకాపా జిల్లా జనరల్ సెక్రటరీ ఎంద్రెడ్డి హేమలత రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో మార్పుల శివరామిరెడ్డి, చిన్నప్పరెడ్డి, నాగరాజు,పెరికల జేమ్స్, రామ్మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, పెరికల చంటి, పింజెర్తి దాస్, తదితరలు పాల్గొన్నారు.

బటన్‌లు నొక్కడం కాదు.. జీవనాడిని పూర్తి చేయండి..

- పోలవరం ప్రాధాన్యతను గుర్తించకుంటే మూల్యం చెల్లించకతప్పదు
- ప్రభుత్వ చరమగీతానికి ప్రజలు బటన్ నొక్కుతారు
- సామూహిక దీక్షలో జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర జీవనాడి పోలవరాన్ని పూర్తి చేయకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్ని బటన్‌లు నొక్కినా ప్రయోజనం శూన్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. పోలవరం ప్రాధాన్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తి స్థాయిలో నిర్మించాలని కోరుతూ సీపీఐ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక దీక్షలు సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిధులు ఇస్తామని చెప్పిన మోదీ మాటలు నీటి మూటలుగానే మిగిలాయన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయమని అడిగే ధైర్యం జగన్‌మోహన్ రెడ్డికి లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతం ఎడారిని తలపిస్తుందని, అప్పర్‌భద్ర పేరుతో తుంగభద్రపై నిర్మిస్తున్న డ్యాం వలన మొత్తం రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా ఉన్న పోలవరాన్ని పూర్తి చేయకుంటే జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు ఓటు అనే బటన్ నొక్కి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించి, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు.

నేటి శిబిరానికి నారాయణ రాక

సామూహిక దీక్షలలో భాగంగా రెండవ రోజు గుంటూరులో జరిగే దీక్షలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హాజరుకానున్నట్లు నాయకులు తెలిపారు. ఈ దీక్షలలో పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, ముప్పాళ్ల శివశంకర రావు, మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, పచ్చల శివాజీ, కాబోతు ఈశ్వరరావు, బందెల నాసర్ జీ, షేక్ వలి, ఆరేటి రామారావు, జిల్లా సమితి సభ్యులు కొల్లి రంగారెడ్డి, జాలాది జాన్ బాబు, జంగాల చైతన్య, ఎన్.దేవా నాయక్, నూతలపాటి చిన్న, రావుల అంజి బాబు, చల్లా మరియదాసు, రెంటాల కుమారి, నాయకులు చెవుల పున్నయ్య, గుర్రంకొండ సత్యానందం, జంగాల యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుర్వినియోగ నివారణపై అవగాహన చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగ నివారణ జాతీయ, రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికా ప్రకారం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, డీఆర్వో చంద్ర శేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామి రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ సైకియాట్రి డా.సాయి కిరణ్ పసుపుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే కష్ట నష్టాలు, చేపట్టవలసిన నివారణ చర్యలపై వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై తల్లితండ్రులు తమ పిల్లల పట్ల జాగరుకత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహన్ రావు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏ.డి సువార్త, డిపిఓ కేశవ రెడ్డి, డీఎంహెచ్ఓ డా.శ్రావణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 145 అర్జీలు

సోమవారం కలక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామి రెడ్డి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 145 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు.

104 సర్వీసులు ప్రారంభం

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను మరింత సులభతరంగా జిల్లాలో అమలు చేసేందుకు 104 సర్వీసు నాలుగు కొత్త వాహనాలను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, సంయుక్త కలెక్టర్ రాజ కుమారిలతో కలసి కలక్టరేట్ ప్రాంగణంలో సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా.శ్రావణ్ బాబు, జీజీహెచ్ పర్యవేక్షకులు డా. ప్రభావతి, డిపిఎంఓ డా.చుక్కా రత్నమన్మోహన్, అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు చిట్టిబాబుకు ఘన నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి: నగరపాలక సంస్థ పరిధిలోని చిన్న కాకానిలో సీనియర్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) చిన్నకాకాని ఏఐటీయూసీ మున్సిపల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు, బొర్రా చిట్టిబాబు(49) ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. పార్టీ యువజన కార్యక్రమాలలో పాల్గొని యువతను పార్టీలోకి తీసుకొచ్చేవారు. జనసేవ దళ్ కార్యక్రమాలు నిర్వహించేవారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి తన కృషి మరువలేనిదని కొనియాడారు. ఆయన మృతదేహానికి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు గండికోట దుర్గారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్నవరపు ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ, తోట గంగాధర్ రావు, చిన్న కాకాని గ్రామ మాజీ సర్పంచ్ బొర్రా మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ కుక్కమల్ల నాగేశ్వరావు, గ్రామ శాఖపార్టీ కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్ కటారి జేసుదాస్, చిన్నకాకాని పార్టీ గ్రామ సీనియర్ నాయకులు జూత్రరు శంకరరావు, కటారి జోజీ, జగ్గరాపు గోపాల రావు, ముద్రబోయినా శ్రీను కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఉభయ రాష్ట్రాల ఉత్తమ జర్నలిస్ట్‌గా దయాకర్

విశాలాంధ్ర-మంగళగిరి : జర్నలిజం విలువలు కాపా డుతూ కేవలం వార్తల రాయ టమే తమపని అనుకోకుండా ఒక జర్నలిస్టుగా సామాజిక బాధ్యత నిర్వహిస్తున్నారు మంగ ళగిరికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బందెల దయాకర్. తన జర్నలిజం కెరియర్లో ఆయన జంతు సంరక్షణ, పశు పక్ష్యాదుల సంరక్షణ, బాల కార్మిక నిర్మూలన, వీధి బాలల సంరక్షణ పట్ల బాధ్యత వహిస్తూ ఎన్నో కథనాలు, ఆ కథనాల ప్రభావంతో జంతు సంరక్షణ, బాల కార్మిక నిర్మూలన అనేవి తన దృష్టికి వచ్చిన ప్రతి అంశంలో జంతువులకు, పక్షులకు, బాలలకు విముక్తి కలిగించారు. నిండా 12 ఏళ్లు కూడా లేని వీధి బాలలు మత్తులో జోగటంపై చేసిన ప్రత్యేక కథనాలతో అధికారులు స్పందించి వారిని సురక్షితంగా బాలల సంరక్షణా కేంద్రాలకు తరలించడం, కొంతమంది బాలలను తల్లిదండ్రులకు అప్పగించి బాలలను ప్రభుత్వ పాఠశాలకు పంపేలా కౌన్సెలింగ్ నిర్వహించడం వంటి బాధ్యత వహించడం జర్నలిస్ట్ దయాకర్‌లో ఉన్న ప్రత్యేక సామాజిక కోణం. తెలుగు జర్నలిస్ట్‌ల సంక్షేమ సంఘం 'జంతు సంరక్షణ-బాల కార్మిక నిర్మూలన' విభాగంలో ఉత్తమ జర్నలిస్ట్ ఉగాది పురస్కారానికి దయాకర్ ఎంపిక కావడం జరిగింది. జర్నలిజంలో తన బాధ్యతను గుర్తించి ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారానికి ఎంపిక చేయడం, ఉగాది పురస్కారానికి తన పేరు ఎంపిక చేయటంపై దయాకర్ ఆనందం వ్యక్తంచేశారు.

తండ్రిని మించిన తనయుడు రామ్‌చరణ్

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగు సినీ పరిశ్రమకు కొన్ని దశాబ్దాలుగా అందని ద్రాక్షాల ఉన్న ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఆస్కార్ అవార్డ్‌ని తీసుకురావడంలో కీలకపాత్ర వహించి తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తండ్రిని మించిన తనయుడిగా వినుతికెక్కారని రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు, జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. సోమవారం రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీనివాసరావుతోటలోని పీర్లచావిడి సెంటర్లో అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. జనసేన 22వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర కార్యదర్శులు బండారు రవీంద్ర, మెహబూబ్ బాషా, బుడంపాడు కోటి, రామిశెట్టి శ్రీనివాస్, శెట్టి శ్రీను, నండూరి స్వామి, దాసరి రాము, మున్నా, సుభాష్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన 12 అర్జీలు సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమంలో ప్రతి అర్జీని పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్, ఎండిఓ భవనం శేషమాంబ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిషేధించాల్సింది పోయి... విక్రయ సమయాన్ని పెంచుతారా...

మద్యం విక్రయాలపై సీఎంకు 'కత్తి' బహిరంగ లేఖ

విశాలాంధ్ర-గుంటూరు : మద్యం షాపుల పనివేళలను రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు పెంచడం అప్రజాస్వామిక నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. మద్యపాన నిషేధాన్ని అంచెలంచెలుగా అమలు చేస్తామని మ్యానిఫెస్టో ద్వారా మాటిచ్చిన వైసీపీ నేడు అమ్మకాలు పెంచడం బాధాకరమన్నారు. దీనివలన కుటుంబ వ్యవస్థ మరింత విచ్ఛిన్నం అవుతుందని చెప్పారు. భర్త తాగి భార్యను కొట్టే సంఘటనలు పెరుగుతున్నాయని, గృహహింస కేసులు పోలీస్‌స్టేషన్‌లలో ఎక్కువగా నమోదు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల సమస్య తీవ్రతరమౌతుందని చెప్పారు. ఈ మేరకు మద్యపానం, ఉద్యోగ కల్పన, భూమి పంపకం, వలస కూలీల సమస్యలు తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి బహిరంగ లేఖ రాశారు. మద్యపాన విషయంలో రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని అన్నారు. మద్యం విక్రయ సమయాన్ని పెంచడం వలన పోలీసులు రోడ్లను కాపాడలేరని, తాగుడు కోసం దొంగతనాలు పెరుగుతాయని, చైన్ స్నాచర్స్ పెరుగుతారని, అత్యాచారాలు పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మఒడి, ఆసరా, చేయూత పథకాల ద్వారా వచ్చే డబ్బు 50 శాతం మళ్లీ తిరిగి మద్యం షాపులకే చేరుతుందన్నారు. మద్యం ఆదాయం ద్వారానే ప్రభుత్వం నడుస్తుందని చెప్పుకోవడం అవమానకర, బాధాకరమైన విషయమన్నారు. ప్రభుత్వమిస్తున్న ఆరోగ్యశ్రీలో కిడ్నీలు, లివర్లు, గుండె జబ్బులు, న్యూరో, మనోవైకల్యాలు సంబంధిత రోగాలకు గురవుతుంది ఎక్కువమంది తాగుబోతులేనని చెప్పారు. దళితవాడలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు, ఆయా ప్రాంతాలకు తగిన కుటీర పరిశ్రమలు రూపొందించి ఉత్పత్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని, ఈ సంవత్సరం తెలంగాణలోలా దళిత బంధు పథకం ద్వారా దళితులకు రూ.10 లక్షలు న్యూ ఇండస్ట్రియల్ పాలసీ ద్వారా ఇచ్చి దళితులను పారిశ్రామికరించాల్సిన అవసరాన్ని గుర్తించాల్సి ఉందని చెప్పారు. అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణ బాధ్యతలో ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభను భాగ స్వామ్యం చేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. అంబేద్కర్ స్మృతివనానికి అనుబంధంగా అంబేద్కర్ యూనివర్సిటీ స్థాపించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో రాగి మాల్ట్ ఇవ్వడం సంతోషకరమని, అయితే దాన్ని ఉదయం అసెంబ్లీ సమయానికి మార్చితే బాగుంటుందని సూచించారు. దళిత విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయి వరకు ఫీజు మినహాయింపు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కుల వివక్షత కారణంగా దళిత విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నందు వలన ప్రత్యేక దళిత యూనివర్సిటీని స్థాపించాలన్నారు. దీని వలన పేద దళితులలో ఆత్మవిశ్వాసం, విద్యా నైపుణ్యాలు పెరిగి ప్రభుత్వ నిర్వహణలో మరింతగా భాగస్వాములయ్యే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

నాలుగో పారిశ్రామిక విప్లవమే స్మార్ట్ ఫార్మింగ్

విశాలాంధ్ర-గుంటూరు : స్మార్ట్ ఫార్మింగ్‌తో రైతులందరూ నాలుగో పారిశ్రామిక విప్లవానికి తెరలేపాలని హైదరాబాద్‌లోని ఇక్రిసాట్ రీసెర్చ్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరవింద్ కుమార్ అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చర్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ రంగాలలో నిష్ణాతులైన 25 మందితో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులు, అగ్రికల్చర్ ఇండస్ట్రీ ప్రముఖుల కోసం ప్రత్యేకమైన 2 ప్యానల్ డిస్కషన్స్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయం, పశువుల ఉత్పత్తి రంగాలలో ఉద్భవించిన కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వనరులను గరిష్టంగా వినియోగించడంతో పాటు పర్యావరణ ప్రభావాన్ని తగ్గించి అధిక దిగుబడులు, నాణ్యతను పెంచవచ్చని అన్నారు. రానున్న కాలంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అనుసంధానమై పనిచేయడానికి కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా ఇక్రిసాట్‌లో ఇంటర్న్‌షిప్‌కు విజ్ఞాన్స్ విద్యార్థులను సాదరంగా ఆహ్వానిస్తామన్నారు. ఐసీఏఆర్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎడ్యుకేషన్, ఉదయపూర్‌లోని ఎమ్‌పీయూఏటీ మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్ఎస్ రాథోర్ మాట్లాడుతూ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సహాయంతో పంట దిగుబడి తర్వాత దాని రక్షణ, పరిరక్షణ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, పంపిణీ, మార్కెటింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు వివరించారు. ఎన్ఐఎఫ్‌టీఈఎమ్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సి.వాసుదేవప్ప మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఫుడ్ సప్లై చైన్ సిస్టమ్‌లో ప్రస్తుతం భారీగా వృద్ధి నమోదవుతుందన్నారు. అనంతరం అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ బి.శరత్‌బాబు, సీఐఎఫ్ఓఆర్ - ఐసీఆర్ఏఎఫ్ డెప్యూటీ చీఫ్ డాక్టర్ మనోజ్ దబాస్, ఐసీఏఆర్ - ఐఐఓఆర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్, కర్ణాటకలోని గుల్బర్గా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్ఆర్ నిరంజన, ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ మాజీ డైరెక్టర్, వీఎన్ఎమ్‌కేవీ మాజీ ఉపకులపతి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, పీపీవీఎఫ్ఆర్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆర్ఆర్ హంచినాల్, ఏపీ మాజీ డీజీపీ, విజ్ఞాన్స్ అడ్వైజర్ డాక్టర్ ఎం.మాలకొండయ్య, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

'జైన్'లో పది విద్యార్థులకు వీడ్కోలు సభ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధన దిశగా శ్రమించాలని, ప్రణాళికలతో సిద్ధమైతే పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు అందుబాటులో ఉండే ఫీజులతో ఉన్నతమైన విద్యనందిస్తున్న జైన్ హైస్కూల్ యాజమాన్యాన్ని కొనియాడారు. ఈ సభకు అధ్యక్షత వహించిన స్కూల్ డైరెక్టర్ ఎం.డి.మున్ను మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు ప్రశాంతంగా వ్రాసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. స్థానిక కార్పొరేటర్ సంకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్యనందిస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం విద్యార్థులకు పరీక్షా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నియమ నిబంధనలను తెలియజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ మాట్లాడుతూ విద్యార్థులందరికి నాణ్యమైన విద్యనందించడంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, చక్కటి ప్రణాళికలతో వారిని పరీక్షలకు సిద్ధం చేశామని, ఎప్పటిలాగే పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 100 శాతం ఫలితాలను సాధించాలని అభిలాషించారు. ఎమ్మెల్యే ముస్తఫా విద్యార్థులకు పరీక్షా సమాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలు రాజీనామా చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రత్యేక హోదా కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలందరూ రాజీనామా చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను ప్రధాని మోడీ మోసం చేసింది కాక ప్రత్యేక హోదా ఇవ్వమని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఎవరు అడిగే వారు లేరనే అహంతో మోడీ ఉన్నట్లు చెప్పారు. మన రాష్ట్ర వనరులను దోచుకుపోతున్నారని మండిపడ్డారు. మన సంపదతో ఊపిరి పీల్చుకుంటూ ఆంధ్రులను అస్తి పంజరాలుగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్‌ను నిర్వీర్యం చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ సంపదను, సహజ వనరులను దోచుకుంటు ఆంధ్రులను బిక్షగాళ్ళుగా మారుస్తున్నాం టని ఆరోపించారు. మోడీ నయవంచక పాలనతో బీజేపీ పార్టీ దేశంలో కనుమరుగవ్వటం ఖాయమని హెచ్చరించారు. సీఎం జగన్ చెత్తపై పన్ను వేసి చంద్రబాబుకు మించిన తుగ్లక్ పాలకుడిగా పేరు గడించారని ఎద్దేవా చేశారు. ఉపాధి మార్గాలను సమాధి చేసి పేద, మధ్య తరగతి వర్గాలను రాజకీయ బానిసలుగా, కూలీలుగా మార్చేశారని మండిపడ్డారు.

నాపై ఆరోపణలు నిరాధారం: ఎంఈఓ

విశాలాంధ్ర-తాడికొండ : తనపై వచ్చిన అవినీతి, లంచాల ఆరోపణలు నిరాధారమని ఎంఈఓ తెనాలి ఇందిరా సోమవారం తెలిపారు. తాడికొండ ఏ ఏ పాఠశాలలో కొలికిపూడి ఆశీర్వాదం వంట మనిషిగా పనిచేస్తోంది. అదే పాఠశాలలో చలివేంద్రం రమాదేవి హెల్పర్‌గా చేస్తున్నారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో రమాదేవిని వంట మనిషిగాను ఆశీర్వాదమును హెల్పర్‌గాను నియమించారు. ఎంఈఓ ఇందిరా లంచాలు తీసుకొని తన స్థానంలో రమాదేవి అనే మహిళను నియమించారని ఆదివారం ఆశీర్వాదం ఆరోపించింది. ఈ విషయమై ఎంఈఓ ఇందిరా స్పందించారు. తాను ఎవరి దగ్గర లంచాలు తీసుకోలేదని తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని కొట్టి పారేశారు. వైసీపీ నియోజవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, నాగరాజు ఆదేశాలతోనే రమాదేవిని వంట మనిషిగా నియమించామని స్పష్టం చేశారు. పాఠశాలలో గుడ్లు, బియ్యం ఇంటికి తరలించడంతో విద్యార్థులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారని, విషయం తాళ్ల శివ నాగరాజు, కత్తెర సురేష్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో ఆశీర్వాదంను తొలగించారని హెల్పర్ చలివేంద్రం రమాదేవి విలేకరులతో చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎస్ఎం హాస్టల్ గుంటూరు పూర్వ విద్యార్థుల (1975-79) బ్యాచ్ 4వ ఆత్మీక సమ్మేళనం విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ ఎం.రామారావు ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ ఒకచోట ఏకమై విద్యార్థి సమయంలో వారు చేసిన ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఒకరిపై మరొకరు జోక్స్ వేసుకుని ఆనంద పరవసులయ్యారు. ఒక్కొక్కరుగా వారున్న స్థితిగతులను వివరించుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఆరుపదుల వయస్సు దాటిన ఈ నేపథ్యంలో మన ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యంగా ఉంటేనే మనం ఈ సమాజానికి ఎంతో కొంత మేలు చేయడానికి వీలుంటుందని వక్కాణించారు.

మానసిక వికాసానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

విశాలాంధ్ర-గుంటూరు : బాలబాలికలలో మానసిక వికాసం సృజనాత్మకతలను వెలికితీసేందుకు పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు తరచూ నిర్వహించాలని సాహితీ సమాఖ్య వ్యవస్థాపకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ డీవీఎస్‌బీ రామమూర్తి అన్నారు. స్థానిక ఆనంద తీర్థ అగ్రహారం ది సెంట్రల్ స్కూల్ శాఖ ఆనంద తీర్థ అగ్రహారం శాఖలో బాలబాలికలు స్వయంగా మస్తిష్కాలకు పదును పెట్టి తయారు చేసుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే పండుగల ప్రాధాన్యత, దేశ భౌగోళిక, రాజకీయ స్వరూపం తదితరాల గురించి చిన్నారులు స్వయంగా వివరించడం అబ్బురపరిచింది. పాఠశాల డైరెక్టర్ ఎస్వీ రామచంద్రరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలకుపైగా నగర విద్యారంగంలో ది సెంట్రల్ స్కూల్స్ విద్యా బోధనలో ప్రత్యేకత చాటుకుంటూ పదవ తరగతిలో రాష్ట్రస్థాయి ఫలితాలను సాధిస్తున్నదని వివరించారు. నేత్ర వైద్యురాలు డాక్టర్ ఎస్.రమాదేవి, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఎస్.జ్ఞానశ్రీ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **BANDIKALLU DURGA VANI** (Old Name) W/o. POGADADANDA POTHURAJU, R/o. D.No.19-5-363, J R Towers, Flat No.502, 3rd Line, Chaitanyapuri, Koritepadu, Guntur - 522007, Guntur District, Andhra Pradesh, have changed my name to **POGADADANDA VIJAYA DURGA VANI**. Hereafter my name is known as **POGADADANDA VIJAYA DURGA VANI.**

CHANGE OF NAM

I, **KAREEMUNNISA BEGU** (Old Name) W/o. MOHAMMED ILIYAS BA R/o. D.No.67-29-1042, Bara Im Panja Street, Ganji Bazar, Gun Guntur District - 522003, And Pradesh, have changed my na to **KARIMUNNISA BEGU** Hereafter my name is known **KARIMUNNISA BEGUM.**

CHANGE OF NAME

I, **MULLAMURI VENKATRAO** (Old Name) S/o. MULLAMURI ADISHESHU, R/o. D.No.5-160, Ananthavarappadu Village, Vatticherukuru Mandal, Guntur District - 522212, Andhra Pradesh, have changed my name to **MULLAMURI VENKATARAO**. Hereafter my name is known as **MULLAMURI VENKATARAO.**

CHANGE OF NAME

I, **SHAIK FAZALLUNNISA** (Old Name) W/o. SHAIK HUMAYUN BASHA, R/o. D.No.66-9-492, Mufti Street, Guntur, Guntur District - 522003, Andhra Pradesh, have changed my name to **SHAIK FAZULUNNISA**. Hereafter my name is known as **SHAIK FAZULUNNISA.**

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు..

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అన్నారు. సోమవారం పార్టీ నాయకులు, అధికారులతో కలిసి 15వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో అధిగమించేందుకు భారీ తాగునీటి పథకం త్వరలో పూర్తి కానున్నదని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతిపక్షం అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తూ కోర్టుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా, యార్డ్ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, రాజేష్ ఖన్నా, పి. బ్రహ్మయ్య, ఎం రామ తలసిరెడ్డి, గాబ్రియేలు నాయకులు, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర - నకరికల్లు : మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో ఇటీవల కురిసిన గాలి వానలకు పడిపోయిన మొక్కజొన్న పంట పొలాలను సోమవారం అధికారులు పరిశీలించారు. 33 శాతం మేర పంట నష్టం జరిగిందని అధికారులు గుర్తించారు. నష్టపోయిన రైతుల నమోదు ప్రక్రియను గ్రామ స్థాయి టీమ్ ఎన్యూమరేషన్ చేయు విధానాన్ని మండల వ్యవసాయ అధికారి కె.దేవదాసు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసి పంట నష్టపోయిన రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 30వతేదీతో గడువు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ కె.హనుమంతరావు, వీఎస్ అబ్దుల్, వీఆర్ఓ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమం ప్రారంభం



విశాలాంధ్ర-నూజెండ్ల : గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని మండలంలోని ములకలూరు గ్రామంలో సోమవారం సర్పంచ్ కంచర్ల కోటేశ్వరమ్మ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి దిరిశాల శివాజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అవగాహన కల్పించారు. అనంతరం పశువుల శాంపిల్స్ సేకరణ, వ్యాధి నివారణ టీకాలు వేశారు. నాలుగు నెలలు దాటిన ప్రతి ఆవు, గేదె, గొర్రె, మేకలకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ దమ్మాలపాటి సుందర్, రైతులు కంచర్ల భాస్కరరావు, ముప్పరాజు సుబ్బారావు, వంగవల్లు వెంకట్రావు, సురాబత్తిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

విశాలాంధ్ర-ఈపూరు : పశు పెంపకందారులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈపూరు బొల్లాపల్లి మండలాల్లోని పలు గ్రామాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఈపూరు పశు వైద్యాధికారి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఇప్పటికీ పలు గ్రామాలలో 3వేల పశువులకు టీకాలు వేశామన్నారు. పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా మార్చి 25 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి ఆవు, గేదె, గొర్రె, మేక లకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఏడు టీములు పనిచేస్తున్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండ్రముట్ల పశువైద్యాధికారి, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక ఎస్‌ఎస్సీ కాలనీలోని కస్తూరిబా బాలికా విద్యాలయంలో గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవ రావు ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినిలకు అవసరమైన మెటీరియల్... పెన్నులు, పెన్సిల్లు, ప్యాడ్లు, షార్ప్‌నర్స్, జామెంటరీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ విద్యార్థినిలు మంచిగా చదివి అత్యధిక మార్కులు సాధించాలని, ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని అది సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో 580 మార్కులకు పైగా సాధించిన విద్యార్థినిలకు ఇంటర్మీడియట్ 2 సంవత్సరాలు తన సొంత ఖర్చులతో చదివిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుత్తా గోవిందయ్య పాఠశాల ప్రిన్సిపల్ ఎఫ్ రత్న శిరోమణి, అకౌంటెంట్ చాట్ల జ్యోతి జాస్మిన్, ఉపాధ్యాయినులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు కల్లి చిన్న మస్తాన్‌రెడ్డి మృతి

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కల్లి చిన్న మస్తాన్ రెడి (72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డిలు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విజ్ఞాన్ స్రవంతి పోస్టర్ ఆవిష్కరణ



విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు, పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏప్రియల్ 14, 15న 'విజ్ఞాన్ స్రవంతి' పేరిట పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనురాధ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గుంటూరులో విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ అంతర కళాశాలకు వివిధ రంగాలు అనగా లలితకళలు, చిత్రలేఖనం, క్రీడలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ నిరులా కళాశాల ప్రిన్సిపాల్ పాతూరి రాధిక, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రుల జీవనాడి పోలవరం

- ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- ఎత్తు తగ్గించి ప్రజలను మోసం చేసేందుకు జగన్ యత్నం
- ప్రాజెక్టును 150 అడుగుల ఎత్తులో నిర్మించేంత వరకూ పోరు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-నరసరావుపేట : ప్రాజెక్టులకే ప్రాజెక్టుగా నిలవనున్న పోల వరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎలాంటి సడలింపులు లేకుండా యుద్ధ ప్రాతిపదికపై చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిర్వహిస్తున్న దీక్ష శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల జీవనాడి, కోస్తా జిల్లా నుంచి రాయలసీమ వరకు సాగు నీటిని అందించే పోలవరం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం గత నాలుగు దశాబ్దాలుగా సీపీఐ మడమ తిప్పని పోరాటం చేస్తుందన్నారు. ప్రాజెక్టు 150 అడుగుల ఎత్తు, 196 పీఎంసీల నీటి నిల్వలు, 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టాలని లక్ష్యం కాగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన కేసుల మాఫీ కోసం, స్వార్థం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందు మోకరిల్లుతూ, ప్రాజెక్టు నిర్మాణాన్ని 133 అడుగుల ఎత్తుకు కుదించాలని, త్యాగధనులైన నిర్వాసితులకు అన్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది తన తండ్రి అని, ప్రాజెక్టును తాను ప్రారంభిస్తానని ముఖ్యమంత్రి ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించటాన్ని ముప్పాళ్ళ ఎద్దేవా చేశారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తిచేయాలని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ దగ్గరికి ప్రతిపక్షాల నాయకులను తీసుకెళ్లాలని జగన్‌కు సూచించారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని పోలవరం ప్రాజెక్టును అటకెక్కిస్తున్నాయన్నారు. సీపీఐ పోరాటాలతో పల్నాడు ప్రాంతాన్ని సస్యశామలం చేసేందుకు ప్రభుత్వాలు శంకుస్థాపన చేసిన వరికలపూడిసెల ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని కోరారు. ఈ దీక్ష శిబిరంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, రైతు సంఘం కార్యదర్శి ఉలవపూడి రాము. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉప్పలపాటి రంగయ్య, వందనం, కృష్ణా నాయక్, పవన్ కుమార్, సాంబయ్య, పుల్లయ్య, నాగేశ్వర రావు, నాగరాజు, సామేలు, వెంకటేశ్వర్లు, పి.నాగరాజు, యు.రాజు, డి.బ్రహ్మయ్య, వెంకయ్య, అంజిరెడ్డి, సిహెచ్ నాగేశ్వరరావులు పాల్గొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి చదలవాడ అరవిందబాబు శిబిరానికి సంఘీభావం తెలిపారు.

అభివృద్ధికి ఆకర్షితులయ్యే వైసీపీలోకి చేరికలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అమలవుతున్న సంక్షేమ పథకాలకు, జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బొల్లాపల్లి మండలంలోని తండా గ్రామం, నూజెండ్ల మండలంలోని టీడీపీకి చెందిన పలు కుటుంబాల వారు వైసీపీలో చేరారు. శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మేము వైసీపీలో చేరామన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు వచ్చిన సామాజిక వర్గాల వారికి పదవులలో తగిన న్యాయం చేయలేకపోయాయని, ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా పదవులలో అన్ని సామాజిక వర్గాల వారికి ఉన్నత పదవులను కేటాయించారని అన్నారు. సీఎం జగన్‌కు రాబోయే ఎన్నికల్లో తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యుల్లాగా చూసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. వినుకొండ గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధిలో దూసుకు వెళ్తుందని, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. వారు ఎన్ని విధాలుగా అడ్డగించిన వినుకొండ అభివృద్ధిని ఆపలేరని నా ప్రాణం ఉన్నత వరకు వినుకొండ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే బొల్లా అన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్



విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారుల ఆధ్వర్యం జరుగుతున్న గ్రామొదయం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న సమస్యల్ని స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతున్న సమయంలో వాటిని సత్వరం పరిష్కరించి, జవాబు దారితనంగా ఉండాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం డాక్టరు, బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్ నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శివ శంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి తమ వినతులను అందించి పరిష్కరించాలని విన్నవించారు. ప్రజల అందించిన ఫిర్యాదుల్లో భూ సమస్యలు, పెన్షన్లు, ఇంటి నివేశన స్థలాలు, ఉద్యోగ, ఉపాధి, రుణాలు, మౌలిక వసతులు కల్పించాలని పలువురు వేడుకున్నారు. ప్రజల సమస్యలను విన్న జిల్లా కలెక్టర్ వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలతో వచ్చే వారిని పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని హితవు పలికారు. వేసవి కాలంలో తరచుగా వచ్చే విద్యుత్తు సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 మంది ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నించినందుకే రాహుల్‌పై చర్యలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: రాహుల్ గాంధీని పార్లమెంట్‌లో మాట్లాడానికి అవకాశం ఇవ్వకుండా, సూరత్ కోర్టు తీర్పును అడ్డం పెట్టుకొని ఆఘమేఘాల మీద ఎం.పి పదవికి అనర్హుడని ఇరవై నాలుగు గంటలలో పార్లమెంట్ సెక్రటేరియట్ ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని, ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమని,రాజ్యాంగానికి వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం పాల్ విజయ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అవలంభించిన విధానాన్ని ఖండిస్తు, రాజీవ్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి తెలుగు సినీ హీరో శివాజీ శొంఠినేనిని పాల్ అభినందించారు. సూరత్ కోర్టు పరువు నష్టం కేసులో రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ కోర్టకీ అప్పీల్ చేసుకోవడానికి ముప్పయి రోజులు గడువు కూడా ఇచ్చిందన్నారు. కానీ రాహుల్ గాంధీ అప్పీల్ చేసుకోకముందే ఎం.పిగా అనర్హత వేటు పార్లమెంట్ సెక్రటేరియట్ వేయటం దేశంలో ఉన్న కోట్లాదిమంది ప్రజాస్వామ్యవాదులు పార్టీలకతీతంగా నిరసన తెలుపుతున్నారని పాల్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకీ అదానికి ఉన్న సంబంధాలను రాహుల్ గాంధీ పార్లమెంట్లో ప్రశ్నించారని, దానికి పార్లమెంట్లో సమాధానం చెప్పలేని ప్రధాని మోడీ, ఇతర బీజేపీ నాయకులు రాహుల్ గాంధీని అక్రమంగా కేసులో ఇరికించారని పాల్ నిరసన తెలిపారు. నరేంద్ర మోడీ అండతో అదాని వేలాది కోట్ల రూపాయలు దేశ సంపదను దోచుకున్నాడు. నీరవ్ మోడీ, లలిత్ మోడీ తదితర ఆర్థిక నేరగాళ్లపై జాయింట్ పార్లెంటరీ కమిటీని కేంద్రప్రభుత్వం వెంటనే వేయాలని డిమాండ్ చేశారు.

విద్యా రంగ అభివృద్ధికి వినుకొండ అనువైనది

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : విద్యా రంగ అభివృద్ధికి వినుకొండ పట్టణం అనువైన ప్రాంతమని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. విఠంరాజుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్ లక్ష్మయ్య స్కూల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణం వందలాది గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉంటుందని ఈ ప్రాంతంలో విద్యారంగం ఏర్పాటు ద్వారా మంచి అభివృద్ధిని సాధించవచ్చునని అందుకు అవకాశాలు అనువుగా ఉన్నాయని వివరించారు. ఈ తరుణంలో ఐఏఎస్ విద్యాబోధనలో విస్తృత సేవలు అందించిన డాక్టర్ లక్ష్మయ్య తన సొంత నియోజకవర్గమైన వినుకొండలో విద్యారంగం ప్రారంభించడం అభినందనీయమని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బొల్లా కోరారు. డాక్టర్ లక్ష్మయ్య పేదరికంలో పుట్టి ఉన్నత చదువులు చదివి ఐఏఎస్ శిక్షణలో వందలాదిమందిని ఉన్నత స్థాయికి నిలిపిన వ్యక్తిగా లక్ష్మయ్య కీర్తి దేశవ్యాప్తంగా వినిపిస్తుందన్నారు. సభలో పాఠశాల డైరెక్టర్ పారా ఉదయ్ చౌదరి మాట్లాడుతూ హైదరాబాదు నగరం స్థాయి ప్రమాణాలతో వినుకొండలో ఉన్నత విద్యకు సమగ్రమైన శిక్షణ అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎస్టీ కమీషన్ మాజీ చైర్మన్ సతీష్ సావిత్రి మాట్లాడుతూ డాక్టర్ పారా లక్ష్మయ్య నిర్వహణలో వందలాది మంది ఐఏఎస్‌లను శిక్షణ పొందినట్లు తెలిపారు. అటువంటి ఉన్నత శ్రేణి అకాడమీ పట్టణంలో ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ మోహన్ కంద సత్యనారాయణ తిరువూరు ఆన్‌లైన్ ద్వారా డాక్టర్ లక్ష్మయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సభలో డాక్టర్ గోగినేని సాంబశివరావు, ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డ వెంకటరామయ్య, ప్రొఫెసర్ రవికుమార్, న్యాయవాది వీరాంజనేయులు, బత్తుల చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్షోత్సవ వేడుకలు



విశాలాంధ్ర-రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పోషణ పక్షోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక రాజుల బజారులో గల కళ్యాణమండపంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా గర్భిణీస్త్రీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకవిలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు, పచ్చళ్ళు, చిరుధాన్యాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ స్టాల్స్‌ను తహశీల్దార్ జి.అంకారావు,ఎండిఓ కె.మ్యాథ్యూబాబు, ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ పరిశీలించి అభినందించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన పౌష్టికాహారం గురించి వివరించారు. వారు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవలసిన నివారణ చర్యలు గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్‌వైజర్లు కె.శశిదేవి, దేవీభాయి, షమీమ్ సుల్తానా, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

సమతులాహారంతో ఆరోగ్యం

విశాలాంధ్ర-కారంపూడి: ప్రతి వ్యక్తి సమతులాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఎంపిడిఓ జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పేట సన్నెగండ్ల అంగన్వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో పోషక దివస్ లో భాగంగా పోషకాహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా తల్లులు, పిల్లలు పోషక విలువలు పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల్లో సర్పంచ్‌కి దక్కని గౌరవం

విశాలాంధ్ర-శావల్యాపురం: టిడిపికి చెందిన సర్పంచ్‌నని తనకు అధికారులు కనీసం గౌరవం దక్కనియట్లేదని కొత్తలూరు గ్రామ సర్పంచ్ గుంటూరు నాగమల్లేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కొత్తలూరు గ్రామంలో 2021 22 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామంలో జరుగుతున్నదని, అందులో భాగంగా సోమవారం గ్రామసభ నిర్వహించారని కనీసం సర్పంచ్ గా ఉన్న నాకు నోటీసులు ఇవ్వకుండానే గ్రామ సభ నిర్వహించారని ఆమె తెలిపారు. ఈవిషయంపై ఎంపీడీవోకి ఫిర్యాదు చేశామని, విషయాన్ని డిపివో, కలెక్టర్ దృష్టి తీసుకెళ్తామని తెలిపారు. ఉప సర్పంచ్ గుంటూరు సాంబశివరావు మాట్లాడుతూ వైసీపీ నాయకులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతా గంగయ్య, గద్దె మస్తాన్ రావు, గోరంట్ల హనుమంతరావు, వెంకట నారాయణ, తదితరులు ఉన్నారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని శ్రీ సాక్షి భవన్నారాయణ స్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కిలారి రోశయ్య సోమవారం పరిశీలించారు. ప్రాధాన్యత పనులను ప్రారంభించక పోవడంతో అధికారులను ఆలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజులు కావస్తున్న ఒక్క పని ప్రారంభించక పోవటంపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ముగిసిన అమ్మిశెట్టి అంత్యక్రియలు

విశాలాంధ్ర-గుంటూరు : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమ్మిశెట్టి ఆంజనేయులు అంత్యక్రియలు సోమవారం బొంగరాలబీడు శ్మశాన వాటికలో నిర్వహించారు. తొలుత బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ జీ, సీనియర్ నాయకులు జూపుడి రంగరాజు, పలు రాజకీయ పార్టీల నాయకులు, స్నేహితులు, బంధువులు, అభిమానులు అమ్మిశెట్టి ఆంజనేయులు పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పార్థివదేహంపై పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, పాలపాటి రవికుమార్, ఈమని మాధవరెడ్డి, వెలగలేటి గంగాధర్, అప్పిశెట్టి రంగ, రాచుమల్లు భాస్కర్ తదితరులు ఉన్నారు. ఆంజనేయులు మరణించి కూడా ప్రజలకు ఉపయోగపడాలనే భావంతో తన కళ్ళను కుటుంబసభ్యుల ఆమోదంతో సక్షమ్ ఫౌండేషన్ ద్వారా నేత్రదానం చేశారు.

గంజికి విశిష్ట ప్రాధాన్యత: ముస్తఫా



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రంజాన్ మాసం ప్రారంభం కాగానే ముస్లిం సోదరులు కఠిన ఉపవాసం పాటించి సాయంత్రం నమాజ్ పూర్తి చేసుకొని తేలికపాటి ఆహార పదార్థాలను తీసుకుంటారు. అందులో భాగంగానే గంజి పదార్థాన్ని తయారు చేస్తుంటారు. సోమవారం పొన్నూరు రోడ్ లాల్ తలబ్ మసీదు వద్ద ఎమ్మెల్యే ముస్తఫా నమాజ్ కోసం వెళుతూ అక్కడ తయారు చేస్తున్న గంజిను పరిశీలించి కొంత సేపు గంజి పదార్థాన్ని తయారు చేసి ముస్లిం సోదరులకు అందించారు.

రాయితీతో పన్ను చెల్లింపునకు 4 రోజులే గడువు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటి పై ఉన్న వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, మరో 4 రోజుల్లో గడువు ముగుస్తుందని నగర కమీషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు. మార్చి నెలాఖరులోపు పన్ను చెల్లించకుంటే వడ్డీ రాయితీ వర్తించదని, ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని తెలిపారు. నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర ప్రభుత్వ జాతీయ గణాంక కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక జీవీఆర్ అండ్ ఎస్ మహిళా డిగ్రీ కళాశాలలోని సమావేశమందిరంలో జిల్లాలోని పలు డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'అధికారిక గణాంకాల వ్యవస్థ-ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో గల పలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు' గోష్టి, తదనంతరం క్విజ్ పోటీని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కడప ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు ఎ.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్ఎస్ఓ(జాతీయ గణాంకాల కార్యాలయం) వారు చేసే వివిధ సర్వేల ఆధారంగానే ప్రభుత్వం అమలు చేసే పథకాలను నవీకరణ చేయనున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వేలకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా పోటీ పరీక్షకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, సర్టిఫికెట్, మెమోంటో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల డైరెక్టర్ భువనేశ్వరి, ప్రిన్సిపాల్ సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా ఉప ప్రాంతీయ కార్యాలయ గణాంక అధికారి డి.హనుమంతరావు పర్యవేక్షించారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రేపూడి గ్రామ సమీపంలో పిఎన్‌సీ కళాశాల వద్ద గుంటూరు-కర్నూల్ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఫిరంగిపురం గ్రామానికి చెందిన త్రిపురమల్లు గౌతమ్(22) ఫిరంగిపురం రామాలయం బజారులో గల మణికంఠ జనరల్ స్టోర్స్ నందు డెలివరి బాయ్‌గా పని చేస్తుంటాడు. నుదురుపాడులో అయ్యప్పస్వామి దేవాలయ ప్రతిష్టా కార్యక్రంలో తన తండ్రి చిన సుబ్బారావుకు టెంకాయలు అమ్మేందుకు టెంకాయాల మూటను అందించి తిరిగి ఫిరంగిపురం వచ్చే క్రమంలో జరిగిన రోడ్ ప్రమాదంలో గౌతమ్ దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహనం కోసం విచారిస్తున్నట్లు ఎస్.ఐ. లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

ఫిష్ ఆంధ్ర దుకాణాలు ప్రారంభం



విశాలాంధ్ర-పొన్నూరు: నిడుబ్రోలు మత్స్య క్షేత్రం కార్యాలయం పరిధిలో పట్టణంలో రెండు ఫిష్ ఆంధ్ర దుకాణాలను (యూనిట్లు) సోమవారం ఎమ్మెల్యే కిలారి రోశయ్య ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్య ఉత్పత్తులను యూనిట్ల రూపంలో అనుబంధ దుకాణాల ద్వారా ఫిష్ ఆంధ్ర పేరుతో రూపొందించిన దుకాణాలను ప్రజలు ప్రోత్సహించాలని ఆయన అన్నారు. నాణ్యమైన చేపలు రొయ్యలు అందించి వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో పొన్నూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి జగన్: ఆర్కే



విశాలాంధ్ర-మంగళగిరి : నియోజకవర్గంలో మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 3686 స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో సుమారు రూ.40కోట్లు జమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశించిన పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ పాలన సాగుతుందన్నారు. రాష్ట్రంలో మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్ర మాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టడం హర్షణీయమని అన్నారు. జగన్ కుల, మత, వర్గ, పార్టీ, ప్రాంతాలకు అతీతంగా ప్రతి మహిళకు చేయూతనందించారని అన్నారు. ప్రతి మహిళకు సొంత అన్నలా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మహిళల శ్రేయస్సు కోసం శ్రమించారని, ఆయన తనయుడిగా నేడు జగన్ ఆయన ఆశయాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, అధికారులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు ప్రజాస్వామ్య విరుద్ధం



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాహుల్ గాంధీని లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విద్యావేత్త బీసీహెచ్ అనంతరామయ్య అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'రాహుల్‌పై వేటు తొందరపాటు చర్య'అనే అంశంపై వక్తలు చర్చించారు. అనంతరం అనంతరామయ్య మాట్లాడుతూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు నిత్యం సుప్రీంకోర్టుపైనే దాడి చేస్తూ ఒత్తిడి పెంచుతుంటే లేదుగానీ, గుజరాత్‌లోని సూరత్‌లో ఒక జిల్లా మెజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును ఆగమేఘాలుపై అమలు చేయాలని హడావిడి చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. సీనియర్ ఇంజనీర్ ఎన్. సదాశివం మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షానికి చెందిన కీలక నాయకుడి విషయంలో ఇంత తొందరపాటుగా వ్యవహరించకుండా ఉండాల్సిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి సింగరయ్య, వాణిజ్యవేత్త బసవ గుప్తా, విశ్రాంత ఆర్టీసీ అధికారి ఎల్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యానవన రైతులకు న్యాయం చేయాలి: గాదె

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు కార్పొరేషన్ పరిధిలో సిటీ కేబుల్ వైర్లు కట్ చేయడాన్ని జనసేన పార్టీ తరుపున ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కారకులను గుర్తించి, వారిచేత పరిహారం కట్టించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాడికొండ నియోజకవర్గం నుంచి గెలిచిన అధికార వైసీపీకి చెందిన ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి గుంటూరు జిల్లాకు రావాలంటే ఎస్సీ-ఎస్టీ కమీషన్‌లో ఫిర్యాదు చేసుకొని, కేంద్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖకి రక్షణ కోసం అర్జీ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలన ఎంత రాక్షసంగా ఉందో అర్థం అవుతుందన్నారు. అసలు ఎమ్మెల్యేలకే రక్షణ లేదంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోయారు. వివేకానంద రెడ్డి హత్య కేసు విషయం మీద ఢిల్లీకి పరుగు తీసేందుకు సమయం ఉంటుంది. బటన్‌లు నొక్కేందుకు సమయం ఉంటుంది కానీ ఒక్క రోజు కూడా కనీసం ఒక్క జిల్లా లేదా ఒక్క ప్రాంతాన్ని సందర్శించేందుకు కానీ, ఆ శాఖకు చెందిన ఆమాత్యునితో జరిగిన నష్టంపై సమీక్ష చేసేందుకు గాని ముఖ్యమంత్రికి సమయం ఉండదని అన్నారు. వారం రోజుల్లోగా లక్షన్నార ఖర్చుపెట్టి ఉద్యానవన పంటలు వేసిన రైతులకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడపా మాణిక్యాలరావు, నారదాసు రామచంద్ర ప్రసాద్, యర్రంశెట్టి పద్మావతి, శిఖా బాలు, దాసరి వెంకటేశ్వరరావు, నెల్లూరు రాజేష్, తుమ్మల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో రోశయ్య?

జగన్‌తో పాదయాత్రలో పాల్గొన్న రోశయ్య (ఫైల్ ఫోటో)

విశాలాంధ్ర-అద్దంకి : అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రేసులో అద్దంకి మండలం వేలమూరిపాడు గ్రామానికి చెందిన సీని యర్ వైసీపీ నాయకులు జ్యోతి రోశయ్య పేరు పరిశీనలో ఉన్నట్లు సమాచారం. ఏఎమ్‌సీ చైర్మన్ ఎస్సీ రిజర్వుడ్‌కు కేటాయించారు. పాదయాత్ర రోశయ్యగా పిలవబడే ఆయన వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ సీనియర్ నేతగా గుర్తింపు పొందారు. వివాద రహితుడు,సౌమ్యుడుగా రోశయ్యకు అద్దంకి నియోజకవర్గంలో గుర్తింపు ఉంది. ఎన్నికల ముందు చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో నెల రోజుల పాటు జగన్‌తో కలసి ఆయన పాదయాత్రలో పాల్గొన్నారు. ఈమధ్య సీఎం జగన్ వేమూరు పర్యటనకు వచ్చినప్పుడు రోశయ్య జగన్‌ను కలసి అద్దంకి ఏఎమ్‌సి చైర్మన్ పదవిని తనకు ఇప్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జగన్ అక్కడే ఉన్న అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు రోశయ్య ఏఎమ్‌సీ చైర్మన్‌గా రోశయ్య పేరు పరిశీలించాలని సూచించినట్లు సమాచారం.

వాలంటీర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని 2 గ్రామ పంచాయతీలలో 2ఖాళీగా ఉన్న వాలంటీర్ల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో సిహెచ్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలమవారిపాలెం(బి సి)పెద అంబడిపూడి (ఎస్.సి) లకు కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు పదవ తరగతి ఉత్తీర్ణులై,18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు వయసు కలిగిన కలిగిన వారై ఉండాలన్నారు. ఈనెల 27వ తేదీ నుండి వచ్చేనెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి వచ్చేనెల 24వ తేదీన, 27వ తేదీన ఇంటర్వ్యూలు ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - చీరాల : దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళిత క్రైస్తవులను ఎస్సిలలోనే ఉంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం ఆనందంగా ఉందని చీరాల ఇవాంజిలిస్ట్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లూథర్ శాస్త్రి అన్నారు. వైస్సార్సీపీ నాయకులు పోతుల సురేష్ ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గ పాస్టర్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ లూథర్ శాస్త్రి,పీటర్ రమేష్,పాల్ రమేష్,దేవసహాయం, ఇశ్రాయేలు, ప్రభుదాసు, అనిల్ కుమార్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

గడప గపడకు ప్రభుత్వ వైద్యం

విశాలాంధ్ర - చీరాల : పేద ప్రజలకు వైద్యాన్ని గడప గడపకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని చీరాల శాసన సభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి అన్నారు. చీరాల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో గడప గడపకు ఆరోగ్యం జగనన్న ధ్యేయం కార్యక్రమంలో భాగంగా ఎనిమిది నూతన 104 వాహనాలను చీరాల శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణ మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఓ తెలగతోటి వెంకటేశ్వర్లు,మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు,తొమ్మిదో వార్డు కౌన్సిలర్ మల్లెల లలితరాజ శేఖర్, మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, డిఇ ఐసయ్య, మునిసిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జీలు, హాస్పిటల్ సూపరిడెంట్ శేషు కుమార్, ఎఫ్పి సినోడల్ ఆఫీసర్ డాక్టర్ యాకోబు, డీపీఎంవోలు, ఆశ వర్కర్లు,ఏఎన్ఎంలు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో కరోనా కేసులు నమోదు అవుతున్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 కోవిడ్ కేసులు నమోదు అయ్యాయని చిన్నపాటి అనుమానం వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కోవిడ్ ఉన్నప్పటికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైద్యులను సంప్రదించి అవసరమైన ముందులు వాడుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి శివ జ్యోతి, సి.పి.ఓ భరత్ కుమార్,గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్,జిల్లా రవాణా శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్,గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్.ఇ విద్యాసాగర్, మత్స్య శాఖ జె.డి సురేష్,పశు సంవర్ధక శాఖ జె.డి సురేష్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్,పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలీమ్స్, డి.ఎం. శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - బాపట్ల : పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుంచి ఆమె వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని, జెరాక్స్ మిషన్లు మూత వేయించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయా లన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిం చాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోడానికి ఆర్.టి.సి. బస్సులను నడపాలని ఆదేశించారు. ప్రాథమిక వైద్యం కోసం ప్రతి కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవిసెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం జిల్లాలోనే తొలిసారిగా జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ల నుంచి ప్రశ్నాపత్రాలు తరలించేటప్పుడు పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. స్పాట్ ఆఫీసర్లను ప్రత్యేకంగా నియమించాలని తెలిపారు. జిల్లాలో 17,344 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. 103 పరీక్షా కేంద్రాలలో పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని, 331 పాఠశాలలనుంచి విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, ఏ.ఎస్.పి. మహేష్, డిఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, డిఇఓ. పి.వి.రామారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిపిఓ. వై.శంకర్ నాయక్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒంటరిగా పోటీ చేసే ధైర్యం ఉందా చంద్రబాబు..?

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి

విశాలాంధ్ర - బాపట్ల : రానున్న ఎన్నికల్లో ఒంటిరిగా పోటీ చేసే ధైర్యం ఉందా చంద్రబాబు అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ ప్రశ్నించారు. బాపట్ల వ్యవసాయకళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంలతో కలిసి మీడియా సమావేవం నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ నాయకులు వైసీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలు పెట్టి గెలిచారని ఆరోపించారు. ఎన్నికలలో ప్రలోభాలు పెట్టి భ్రష్టు పట్టించే సంస్కృతి టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఒంటరిగా పోటీ చేయటం చేతగాని తెలుగుదేశం వక్రమార్గంలో వచ్చి లక్ష్యం సాధించామనటం కూడా విజయమేనా అని ఎద్దేవా చేశారు. వైసీపీ తరుపున ఎమ్మెల్యేగా గెలిచి నైతికత లేకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేయటం దురదృష్టకరం అన్నారు. ఒక స్థానం విజయాన్ని చూపి వాపును చూచి బలుపు అనుకుంటున్నారని తెలిపారు. టీడీపీవి నీటిబుడగ రాజకీయాలు అని బుడగ పెలిపోయే రోజు దగ్గర్లో ఉందని తెలిపారు. టీడీపీ ఎన్ని కుట్రలు చేసిన 2024 ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి రావటం తథ్యమని జగన్ మరోసారి సీఎం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 65 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిచ్చి చరిత్ర సృష్టించారన్నారు. దేశంలో వైసీపీ ప్రభుత్వం పాలన వలే అధికారంలోకి వచ్చిన 4 ఏళ్లలో ఇన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర ఎక్కడా జరగలేదన్నారు. వైజాగ్ ఇండస్ట్రీ సమ్మెట్‌లో పారిశ్రామికవేత్తలందరిని ఒకేవేదికపైకి తీసుకొచ్చి లక్షల కోట్ల రూపాయలతో పరిశ్రమలు పెట్టించే విధంగా ముఖ్యమంత్రి ప్రత్యేక చోరవ తీసుకున్నారన్నారు. పరిశ్రమలతో యువతకు ఉపాధి కల్పించే ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా సీమన్స్ సంస్థ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చేందుకు 3,300 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని నిర్ణయం తీసుకొని మూలధనం 10శాతం నిధులతోనే నిధులు వచ్చినట్లు చూపించారని విమర్శించారు. రాష్ట్ర యువత భవిష్యత్తును నాశనం చేశారని టీడీపీపై విమర్శలు గుప్పించారు.

వైసీపీ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- శాసనమండలి చీఫ్‌విఫ్ ఉమ్మారెడ్డి

విశాలాంధ్ర - బాపట్ల : వైసీపీ పాలనలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు శాసనమండలి చీఫ్ విఫ్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బివి.నాథ్ ఆడిటోరియంలో సోమవారం వైఎస్సార్ ఆసరా మూడోవ విడత నిధులు విడుదల కార్యక్రమం డిఆర్డిఎ పీడీ డాక్టర్ బి.అర్జునరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన విధానం గతానికి భిన్నంగా పూర్తిస్థాయిలో ప్రజలకు రావాల్సిన హక్కులు,పథకాలు నేరుగా మధ్యవర్తి లేకుండా అందిస్తున్నారని తెలిపారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఇంటిలోని పిల్లలను ఉన్నతంగా చదివించేలా విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యున్నతికి, పిల్లలు విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు వివరించారు. రాజ్యసభ సభ్యులు, వైసీపీ జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలలో 27,630 స్వయం సహాయక సంఘాలలోని 71,026 మంది మహిళలకు 238.32 కోట్ల రూపాయలు ఆసరా ద్వారా అందించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో ఆసరా ద్వారా 3,454 స్వయం సహాయక సంఘాలకు 97.55 కోట్ల రూపాయలు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి చెప్పిన ప్రతికార్యక్రమంతో, అదనంగా అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చినపోతుల హరిబాబు, జడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరురాణి, డిఆర్‌డిఏ అధికారి లక్ష్మణాచారి, జిల్లా సమైక్యాధ్యకురాలు అశ్విని, మండల సమైక్యాధ్యక్షురాలు కరుణ, మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు కుర్రా రమాదేవి, వైసీపీ మండ లాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, ఎంపిడివో ఎ.రాధాకృష్ణ కార్పోరేషన్ డైరెక్టర్లు కన్నా మామిడయ్య, కొక్కిలిగడ్డ చెంచయ్య ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

దళితులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర - కర్లపాలెం : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళిత పథకాలను ఎత్తివేసి దగా చేసిందని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని పేరలి మల్లెలవారిపాలెం గ్రామంలో సోమవారం పార్టీ విధానాలను వివరిస్తూ మహిళలకు చీర,సంచి, కరపత్రాలను అందజేశారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తెలుగుదేశం పార్టీని చేరువ చేయడమే లక్ష్యంగా మీ మాట నా బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి నేడు 3వేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నానని తెలిపారు. నా కృషిని గుర్తించి చంద్రబాబు పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారని పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. మీ అందరి సహకారంతో ఎమ్మెల్యేగా గెలిస్తే బాపట్లను అభివృద్ధి చేసుకొందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు తదితరులున్నారు.

గాలి కుంటు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : పశువులకు గాలి కుంటు టీకాలు తప్పకుండా వేయించాలని మంతెనవారిపాలెం పశు వైద్యాధికారిని కాటూరి తిరుమల తేజ అన్నారు. సోమవారం మండలంలోని మంతెనవారిపాలెం గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలి కుంటు వ్యాధి వొచ్చే అవకాశం ఎక్కువగా ఉంటాయన్నారు. దీని వలన పశువులలో పాల సామర్థ్యం తగ్గుతుందన్నారు. అంతే కాకుండా సూడి కట్టటం కూడా తగ్గు తుందన్నారు. సూడి గేదెలకు ఈ వ్యాధి సోకితే ఈసుకుపోతాయన్నారు. ఈ టీకాలు ప్రతి ఒక్క పశువుకి ఉచితంగా వేస్తారన్నారు. నాలుగు నెలల దూడలకు కూడా టీకాలు వెయొచ్చన్నారు. ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులు వ్యాధి బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటపతి రాజు, సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యశాల సిబ్బందిపై ఫిర్యాదు

విశాలాంధ్ర - వేటపాలెం : వేటపాలెం కాంప్లెక్స్‌లో ఉన్న బండ్లఆదెమ్మ మెమోరియల్ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ప్రభాకర్ సిబ్బందిపై వేటపాలెం జడ్పీటిసి బండ్ల తిరుమలదేవి సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు వైద్యశాల సిబ్బంది వైద్యశాలలోనే ఫుటుగా మద్యం సేవించి హల్చల్ చేస్తూ వైద్యశాల సిబ్బంది ఒకరికొకరు ఘర్షణలకు దిగి వచ్చిన పేషెంట్లను దుర్భాషలాడి హల్చల్ చేయగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేటపాలెం పోలీసులు రంగంలోకి దిగి సర్ది చెప్పారు. ప్రాథమిక వైద్యశాల సిబ్బందిపై గతంలో జనవరి నెలలో ప్రకాశం జిల్లాలోని జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కూడా డాక్టరు, సిబ్బందిపై జడ్పీటిసి తిరుమల దేవి ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె అన్నారు. రోజువారి ఓపీలు గతంలో దాదాపుగా 150 వరకు వచ్చాయని ప్రస్తుతం15 నుంచి 20 మాత్రమే వస్తున్నాయని దీనికి కారణం వైద్యశాల సిబ్బంది నిర్లక్ష్య ధోరణి అని ఆమె ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి, తగు విచారణ చేసి ప్రజలకు తగు వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బులసల రామలక్ష్మి, బండ్ల బాబు, పర్వత రెడ్డి రేణుక తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

విశాలాంధ్ర - చీరాల : తెలుగు ప్రజల ఆరాధ్య దైవం రామారావు కారణజన్ముడని,ఆయన జయంతి వేడుకలలో నేను భాగస్వామ్యమవటం నా అదృష్టంగా భావిస్తున్నానని టీడీపీ ఇంచార్జి మద్దులూరి మాల కొండయ్య అన్నారు.తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేట బాలమ్మ వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు వ్యక్తిగత పరిశుభ్రత వస్తువులు అందచేసి అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మామిడిపాక హరిప్రసాద్,సరాల తిరుపతి రాయుడు,పలగర్ల మస్తానరావు, రామిరెడ్డి,చప్పిడి వెంకట్రావు,ప్రభాస్, వావిలకొలను ప్రేమ కుమార్,కొతరపు జనార్ధనరావు,బాలరాజు,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర - చీరాల : మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న పదిహేను వాలంటీర్ల పోస్టు నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో నేతాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవంగపూరిలో ఓసి రెండు, బీసీ మహిళలకు రెండు,ఎస్ సి జనరల్ ఒకటి, మహిళలకు ఒకటి, గవినివారిపాలెంలో బీసీలకు, జనరల్ రెండు, మహిళలకు ఒకటి,తోటవారిపాలెంలో ఓసిలకు ఒకటి, ఇపురుపాలెంలో బీసీ జనరల్ మూడు,మహిళలకు రెండు ఖాళీలు కేటాయించారని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు పదవ తరగతి ఉత్తీర్ణులై,18ఏళ్ల నుండి 35 ఏళ్లు వయసు కలిగిన కలిగినవారై ఉండాలని, ఈనెల 27వ తేదీ నుండి వచ్చేనెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి వచ్చేనెల 24వ తేదీన, 27వ తేదీన ఇంటర్వ్యూలు ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఎంపికైన అభ్యర్థులకు మే నాలుగవ తేదీన నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు.

ఘన కీర్తి కలిగిన గురువు ఇక లేరు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల విలియం బూత్ జూనియర్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.జె ఫ్లోరెన్స్ రూత్ (70) సోమవారం తెల్లవారుజామున అమెరికాలోని తన కుమార్తె నివాసం నందు పరమపదించినట్లు విలియం బూత్ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ అండ్ సూపర్డెంట్ కే.డేవిడ్ పేర్కొన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ రూత్ మరణం అనేకమంది విద్యా ర్థులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని తెలియ జేశారు. యూత్ ప్రిన్సిపాల్‌గా కొనసాగిన కాలంలో లెక్చరర్‌గా అనేకమంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసిన ఘనత ఆమెకే దక్కుతుందని కొనియాడారు. అదేవిధంగా ఆమె భర్త విలియంబూత్ జూనియర్ కళాశాలకు 25 సంవత్సరాలు ప్రిన్సిపాల్‌గా కొనసాగిన ఘనత కూడా ఆ కుటుంబానికి దక్కుతుందని తెలియజేశారు. ఆమె మృతికి సంతాపంగా కళాశాల ప్రాంగణము నందు ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, సెంట్రల్ కోర్ ఆఫీసర్ కెప్టెన్ వి.శేఖర్, టి విజయ్ కుమార్, బిల్లా ఎజ్రా, ప్రభుదాస్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జగన్ హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా అమలు చేయలేదని వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్డి భాగ్యశ్రీధర్ డిమాండ్ చేశారు. సీపీఐ పిలుపు మేరకు ఇళ్ల నిర్మాణం ప్రభుత్వమే చేపట్టాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా కర్లపాలెంలో సోమవారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిరసన తెలిపి కార్యదర్శికి మెడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునే పరిస్థితుల్లో లేనందున ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లేనిపక్షంలో రూ.5 లక్షలు, సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుక అందించాలని పలు దఫాలుగా పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవటం శోచనీయం అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్నీ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శవనం హరిబాబురెడ్డి, పిట్టు కాసులరెడ్డి, సింహాద్రి శివయ్య, షేక్ కరిముల్లా, షేక్ జిలానీ తదితరులున్నారు.

ప్రజాధనానికి తూట్లు..ఆసుపత్రికి పార్టీ రంగు

- టీడీపీ జిల్లా ఇన్‌చార్జి వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనానికి తూట్లు పొడుస్తూ అధికారపక్ష పార్టీ రంగులను ప్రజా వైద్యశాలకు వేయడం సిగ్గుచేటు అని తెలుగుదేశం పార్టీ బాపట్ల ఇన్చార్జి వేగేస్తున్న నరేంద్రవర్మ రాజు పేర్కొన్నారు. సోమవారం ఏరియా హాస్పిటల్ వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మొండి వైఖరి విడనాడాలి, ప్రభుత్వ ఆస్తులుపై పార్టీ రంగులను తీసివేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఏరియా హాస్పిటల్ వార్డులను, సేవలను గూర్చి వైద్యం చేయించు కుంటున్న సామాన్యులు వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్స్ సూపరిడెంట్ డాక్టర్ సిద్ధార్థ తో మాట్లాడుతూ ప్రజలకు, ప్రజాధనానికి తూట్లు పడవకుండా సంరక్షించాల్సినదిగా సూచించారు. బాపట్లలో శాసనసభ్యులు కోన రఘుపతి ధ్రుతరాష్ట్ర పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. పది రోజులలో ఏరియా వైద్యశాలకు వేసిన పార్టీ రంగుల గనుక మార్చకపోతే హైకోర్టులో ఫిల్ వేస్తామని హెచ్చరించారు. ప్రజాధనాన్ని రంగులు కొరకు ఎలా ఖర్చు చేస్తారని వేగేసిన నరేంద్రవర్మ అధికార పక్ష పార్టీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల శివ, మాజీ ఎంపీపీ మానం విజేత, ఎస్సీ సెల్ నాయకులు సలగల సురేష్, అడె వంశీ, మందపాటి ఆంద్రియ, మద్దాల మసలయ్య, నల్లమల్లి నాగేశ్వరరావు, కృష్ణ, కృష్ణ గౌడ్, చిన్న బాబు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసిన సీఎం జగన్

విశాలాంధ్ర - జె.పంగులూరు : ఎన్నికల హామీను 99 శాతం అమలు చేసిన నాయకుడు సీఎం జగన్మోహన్ రెడ్డి అని అద్దంకి వైసిపి ఇన్చార్జ్, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పంగులూరులో హైస్కూల్‌లో జరిగిన మూడో విడత వైయస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలలో డ్వాక్రా రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి అధికారం రాగానే మర్చిపోయారని గత ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. మూడో విడత వైయస్సార్ ఆసరా పథకం ద్వారా మండలానికి రూ.7 కోట్లు 900 మంది డ్వాక్రా మహిళలు లబ్ధి పొందాలని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య మాట్లాడుతూ మహిళలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని అన్నారు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న జగన్ మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయని వెంకటసుబ్బారావు,మండల వైసీపీ కన్వీనర్ ఎర్రం శ్రీనివాసరెడ్డి, జడ్పీటిసి రాయిని ప్రమీల ఎంపీపీ తేళ్ల నాగమ్మ ఎంపీటీసీ రాములు కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాసిం ఏపిఎం జ్యోతి ప్రసాద్ సిసి దాసు సర్పంచులు ఎంపీపీలు ఎంపీటీసీలు వైసీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎప్పుడు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గతేడాది అక్టోబర్ 25వ తేదీన అనారోగ్యంతో మరణించిన ఏఎస్సై కె.బ్రహ్మయ్య భార్య లక్ష్మికి సోమవారం అడిషనల్ కార్పస్ ఫండ్ రూ. 1 లక్ష ఎస్పీ అందజేశారు. ఎస్పీ కె.బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసు శాఖ అన్ని విధాలు అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. ప్రభుత్వం నుండి అందవలసిన ఇతర అన్ని బెనిఫిట్స్ లను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బి.సెక్షన్ సూపర్డెంట్ కే.రాధిక ఇతర డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు ఛిద్రం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : విద్యార్థి దశ నుండి మంచి సంకల్పం నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా అడుగులు వేయాలని రేపల్లె డిఎస్పి మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని పొన్నపల్లి గీతం కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు అయితే వారి జీవితాలు ఎందుకు పనికిరాకుండా పోతాయి అన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఉజ్వలమైన భవిష్యత్తును కూడా లెక్కచేయకుండా ఈ మహమ్మారి బారినపడి బంగారు భవిష్యత్తునే కాకుండా జీవితాలను కూడా చాలించారన్నారు. కళాశాల పరిసరాలలో మత్తు పదార్థాలు అమ్మిన కొనుగోలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దుర్వ్యసనం మొదట్లో పట్టా ప్రాంతాల్లో ఉండేదని అది క్రమేపి గ్రామాలకు కూడా విస్తరించిందని వీటి వాడకంపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఈ మాదక ద్రవ్యాల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా యువత వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ప్రభుత్వం సంకల్పం అనే పేరుతో మాదకద్రవ్యాల నిర్మూలనకు విశేష కృషి చేస్తుందన్నారు. పోలీసులు వీటిని అరికట్టేందుకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటారన్నారు. అనంతరం విద్యార్థులచే మాదకద్రవ్యా నిర్మూలనకు కృషి చేస్తామని ఎస్సై డి వెంకట కొండారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ రావు కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ రత్నకుమార్ నగరం ఎస్సై రామకృష్ణ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రావిపాడు రోడ్ సెంటర్

విశాలాంధ్ర-కంభం : ప్రకాశం జిల్లా కంభం పట్టణంలోని అమరావతి టు అనంతపూర్ హైవే స్థానిక రావిపాడు రోడ్డు సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది అనడంలో అతిశయోక్తి లేదు. దీనికి ప్రధాన కారణం హైవేలను దుకాణాదారులు ఆక్రమించడమే. దీనిని పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు ఏటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏదో మీడియా లోనో లేదా వార్త పత్రికలలో వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేసి రోడ్డు పైకి వచ్చిన వాటిని తొలగిస్తారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. మీరు గమనిస్తే రావిపాడు రోడ్డులో రోడ్డు అసలు కనిపించదు, ఆటోలు, పండ్ల బండ్లు, బైకులు, జూస్ బండ్లు మాత్రమే మనకు దర్శన మిస్తున్నప్పుడు ఇక ప్రమాదాలు ఎందుకు జరుగవు అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి హైవే పైకి ఆక్రమించిన దుకాణాదారులపై చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.